నమస్తే తెలంగాణ
వరంగల్
5 | వరంగల్, మంగళవారం 14 జనవరి 2025 | WARANGAL

మమ్మేలు మల్లన్నా..

- భారీగా తరలివచ్చిన భక్తులతో పోటెత్తిన ఐనవోలు
- శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లు, పట్నాలతో మార్మోగిన ఆలయం

ఐనవోలు, జనవరి 13 : జానపదుల జాతరగా పేరొందిన ఐనవోలు బ్రహ్మోత్సవాలకు సోమవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మమ్మేలు మల్లన్నా అంటూ స్వామిని వేడుకున్నారు. భోగి పండుగ పెద్ద ఎత్తున ప్రజలు రావడంతో ఆలయం పోటెత్తింది. శివ సత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లు, పట్నాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. కోరిన కోర్కెలు తీర్చిన కోరమీసాల మల్లికార్జున స్వామికి కోడెను కట్టి, పట్నాలు వేసి, గండ దీపం వెలిగించి, పెద్ద శావ తీసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచే తాకిడి పెరగడంతో స్వామిని దర్శించుకోవడానికి దాదాపు రెండు నుంచి మూడు గంటలు పట్టింది. భక్తులు పడమర వైపున ఉన్న ఎల్లమ్మ దేవాలయంలో బోనాలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ, పోలీసు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఐలోని మల్లన్నను స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వరంగల్ మేయర్ సుధారాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ తదిరులు దర్శించుకున్నారు. కాగా, మంగళవారం సంక్రాంతి సందర్భంగా ఆలయంలో విశేష పూజలతో పాటు రాత్రి పెద్దబండి, ఐనవోలు, ఒంటిమామిడిపల్లి, ముల్కలగూడెం, పెరుమాండ్లగూడెం గ్రామాల ప్రభ బండ్లు తిరిగే కార్యక్రమం నిర్వహిస్తారు.

బోనాలతో ఆలయానికి వస్తున్న శివసత్తులు

ఐనవోలు మల్లికార్జునస్వామి

కొత్తకొండ జనసంద్రం

ప్రత్యేక అలంకారంలో వీరభద్రస్వామి

> 12లో

ఐనవోలులో పెద్దశావ తీస్తున్న భక్తులు

హనుమకొండలో భోగిమంట వద్ద సందడి

సంక్రాంతి సందడి

- ఉమ్మడి జిల్లాలో వైభవంగా భోగి పండుగ
- ఇళ్ల ముందు కొలువుదీరిన ముత్యాల ముగ్గులు
- పతంగులు ఎగురవేసిన చిన్నారులు, పెద్దలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో సంక్రాంతి పండుగ సందడి నెలకొంది. పట్టణాలు, వివిధ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చిన వారితో పల్లెలు కళకళలాడుతున్నాయి. సోమవారం భోగి పర్వదినాన్ని ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. భోగి మంటలు వేసి పాటలు, కోలాటాలతో ఉత్సాహంగా గడిపారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా మహిళలు, యువతులు ఉదయమే లేచి ఇళ్ల ముందు వివిధ రంగులతో పండుగ ప్రాశస్త్యాన్ని తెలిపేలా ముత్యాల ముగ్గులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలు, నవ ధాన్యలతో అందంగా అలంకరించారు. ఘుమఘుమలాడే పలు రకాల పిండి వంటలను తయారుచేశారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు ఆకట్టుకున్నాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా ఇళ్లపైన, ఖాళీ ప్రదేశాలు, పంట పొలాల్లో పతంగులు ఎగురవేస్తూ సంబురంగా గడిపారు. వివిధ రంగులు, ఆకృతుల్లో గాలిపటాలు ఆకాశంలో హరివిల్లులా దర్శనమిచ్చాయి. కాగా, బుధవారం సంక్రాంతి, గురువారం కనుమ పండుగలు జరుపుకునేందుకు ప్రజలు సర్వం సిద్ధం చేసుకున్నారు.

నగరంలోని బాలాజీనగర్‌లో పతంగులతో చిన్నారులు

ఐనవోలు, కొమురవెల్లి జాతర్లకు ప్రత్యేక బస్సులు

వరంగల్ చౌరస్తా, జనవరి 13 : ఐనవోలు, కొమురవెల్లికి జారతకు వెళ్లే భక్తుల కోసం ఆర్‌టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించారు. సోమవారం నుంచి వారం రోజుల పాటు ప్రత్యేక బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. అందుకు తగిన విధంగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. . గత సంవత్సరం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వారం రోజుల పాటు 24 గంటల సర్వీసులు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. వారం రోజుల్లో 500 సర్వీసులు లక్ష్యంగా పెట్టుకొని భక్తులకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక కౌంటర్ల వద్ద భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ సేవలను వినియోగించుకొని, సురక్షితంగా ప్రయాణించాలని ప్రయాణికులను కోరారు.